




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక :21 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం మంగళవారం 3 ఫిబ్రవరి 2026 వెల : 5/-రూ ॥
VOLUME :1 ISSUE : 21 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM TUE 3 FEBRUARY 2026 PRICE : 5/- RS
Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

- మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో శిక్ష అమలు
- ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది ఉరిశిక్ష విధించిన కోర్టు
- శిక్షను అమలు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడి

- మిగతా 2లో



## దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా


- 90 ఏళ్ల వయస్సులో మెడిటేషన్ అనే ఆల్బమ్‌కు అవార్డు
- దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదన్న చైనా
- చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ

- మిగతా 2లో

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది..

## వైసీపీపై చంద్రబాబు ఫైర్

- అధికారం కోల్పోయామనే అసహనంతో రెచ్చగొట్టేందుకు యత్నం
- ఆ పార్టీ ట్రాప్ లో పడొద్దంటూ పార్టీ నేతలకు సూచన
- మంత్రులు, టీడీపీ సీనియర్ నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్




ఆంధ్రప్రదేశ్ లో అలజడి సృష్టించాలని, హింసను ప్రేరేపించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. ఇందులో భాగంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దని టీడీపీ నేతలకు ఆయన సూచించారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ఆయన ఈ రోజు ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.అధికారం కోల్పోయామనే అసహనంతోనే వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని చంద్రబాబు చెప్పారు. అందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని, సంయమనం పాటించాలని చెప్పారు. ఈ టెలీకాన్ఫరెన్స్ లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.వైసీపీ రెచ్చగొట్టే చర్యలకు దిగుతోందన్న చంద్రబాబు.. ఆ పార్టీ ఉచ్చులో పడి టీడీపీ శ్రేణులు సంయమనం కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీనియర్ నేతలదేనని చెప్పారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైసీపీ పుట్టిందని, ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని అన్నారు.

ఈ సందర్భంగా తప్పుచేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీని రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలో తాము చేసిన పాపాల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలని ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న టీడీపీ అజెండా సహజంగానే వైసీపీ నేతలకు నచ్చదని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు.




## ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

### కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్

- చంద్రబాబు ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా తీవ్ర విమర్శలు
- అధికారంలోకి రాగానే వైసీపీ నేతలపై దాడులు చేస్తున్నారని ఆరోపణ
- పలువురు మాజీ మంత్రులు, నేతల ఇళ్లపై దాడులు జరిగాయన్న రోజా
- ఇదేనా చంద్రబాబు చెప్పిన 'రూల్ ఆఫ్ లా' అని సూటి ప్రశ్న
- సాక్షి, డెక్కన్ క్రానికల్ కార్యాలయాలపైనా దాడులని వెల్లడి

తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, వారి ఆస్తులు, పార్టీ కార్యాలయాలే లక్ష్యంగా దాడుల పరంపర కొనసాగుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న 'రూల్ ఆఫ్ లా' (చట్టబద్ధమైన పాలన) ఇదేనా? అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలపై జరిగిన దాడుల జాబితాను ఆమె వివరించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని, పేర్ని నాని, దాడిశెట్టి రాజా ఇళ్లతో పాటు, వల్లభనేని వంశీ, ముద్రగడ పద్మనాభం, భూమన కరుణాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతల నివాసాలపై దాడులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. హిందూపురం

- మిగతా 2లో



# ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్.. బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు

- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

## లోక్‌సభలో రాహుల్ vs కేంద్రం..

### ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడిందనే మాట నేను చెప్పింది కాదు: రాహుల్ గాంధీ
- స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ నరవణే తన పుస్తకంలో రాశారని వెల్లడి
- ఈ పుస్తకం బయటకు వస్తే ప్రజలకు విషయం తెలుస్తుందని కేంద్రానికి భయం పట్టుకుందని వ్యాఖ్య
- దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్ సభలో లేవనెత్తేందుకు అనుమతించడం లేదని ఆరోపణ



లద్దాఖ్, డోక్లాం ప్రతిష్టంభన గురించి కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నలతో గందరగోళం నెలకొంది. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ఓ మ్యాగజైన్ ప్రచురించింది. ఆ వివరాలను రాహుల్ లోక్‌సభలో ప్రస్తావించారు. ఆయన వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. రాహుల్ చెబుతున్న పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని.. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని

- మిగతా 2లో




## మాకు ప్రాణహాని ఉంది..

### భద్రత కోసం హైకోర్టును ఆశ్రయించిన జోగి రమేశ్

- ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయని పిటిషన్‌లో ఆరోపణ
- దాడి జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారని ఆయన కుమారుడి ఆవేదన
- తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని కోర్టుకు విన్నపం
- లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరపనున్న హైకోర్టు

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తన భద్రత విషయమై ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని తన నివాసంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ, తనకు భద్రత కల్పించాలని

- మిగతా 2లో

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కవిత కీలక వ్యాఖ్యలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే

- మిగతా 2లో



## వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

- అంబటి అరెస్ట్ తో ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు
- తిరుమల ప్రతిష్ఠ దిగజార్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న సజ్జల, బొత్స
- వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఏపీలో శాంతి భద్రతల వైఫ్యల్యానికి ఎవరు కారణం?

శాంతి భద్రతల వైఫల్యం ఏ ప్రభుత్వానికైనా చెడ్డపేరు తెస్తుంది. ఎన్ని మంచి పనులు చేసినా.. ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా శాంతిభద్రతల సమస్య మాత్రం ప్రజల్లోకి తొందరగా చొరబడుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలోనూ అదే జరిగింది. నాడు జగన్ ప్రభుత్వం టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంతో పాటు అనేక రకాలుగా లా అండ్ ఆర్డర్ సమస్య ఆ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడానికి కారణమయింది. ఇప్పుడు అదే సమస్య కూటమి ప్రభుత్వంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ఘర్షణలు, హత్యలు, అత్యాచారాలు ప్రభుత్వానికి చెడ్డపేరును తెచ్చిపెడుతున్నాయి.

**శాంతి భద్రతలు...**

నియోజకవర్గాల స్థాయిలో శాంతి భద్రతలు అదుపు తప్పడంపై వాటి ప్రభావం రానున్న ఎన్నికల్లో పడే అవకాశముందన్న ఆందోళన సీనియర్ నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందులో సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే ప్రజలకు తెలిసిపోతుంది. పోలీసులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ పోలీసుల తీరు కూడా ఆక్షేపణీయంగానే కనిపిస్తుంది. ఎవరి నుంచి వచ్చిన ఆదేశాలు మాత్రమే తెలియదు కానీ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ల ఇళ్లపై దాడులు జరిగిన సమయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఇంత బీభత్సం జరుగుతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరించడాన్ని బట్టి చూస్తే శాంతిభద్రతల పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను...**

అసలు వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను ముందుగానే పోలీసులు తొలగించి ఉంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. రెండు రాజకీయ పార్టీల మధ్య పోరు ఉన్న సమయంలో వివాదాస్పద ఫ్లెక్సీలను పెడితే ఖచ్చితంగా అక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని చెప్పాలి. ఆ మాత్రం కూడా తెలియకుండా పోలీసు శాఖ నిద్రమత్తులో జోగుతుండటాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. ఆరోజు ఫ్లెక్సీని తొలగించి ఉంటే ఇటు టీడీపీ, అటు వైసీపీ నేతల మధ్య ఘర్షణ తలెత్తి ఉండేది కాదని, అలాగే మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెడితే జోగి రమేష్ ఇంటిపై దాడికి సాహసించి ఉండే వారు కాదన్నది కూడా అంతే వాస్తవమని న్యాయవాదులు కూడా చెబుతున్నారు. ఏపీలో జరుగుతున్న ఈ వివాదాలకు పోలీసుల వైఫల్యమే కారణమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

# వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టించాయి. ఈ క్రమంలో రాంబాబుపై కేసు నమోదు కావడం... కోర్టు ఆయనకు రిమాండ్ విధించడం తెలిసిందే. తాజాగా, మరో మాజీ మంత్రి జోగి రమేశ్ పై కూడా కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల వైసీపీ నేతలతో పార్టీ ముఖ్య నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఈ రెండు ఉమ్మడి జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సమన్వయకర్తలు హాజరయ్యారు. ఇటీవల చోటు చేసుకుంటున్న అంశాలపై పార్టీ నేతలు ఎలా స్పందించాలనే అంశంపై సజ్జల, బొత్స సూచనలు చేశారు. తిరుమల ప్రతిష్ఠ దిగజార్చే విధంగా కూటమి వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా నేతలు అన్నారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను నిలువరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీ నేతలకు భద్రత కల్పించేందుకు పోరాటం చేయాలని తెలిపారు.

# ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

- మొదటి పేజి తరువాయి

వైసీపీ కార్యాలయం, మార్గాని భరత్ కార్యాలయాలపై కూడా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా, దేవినేని అవినాశ్, విడదల రజినిపై దాడికి యత్నించారని, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడి జరిగిందని వివరించారు. తనపై కూడా ఓ వ్యక్తిని ప్రయోగించి బూతులతో దాడి చేయిస్తున్నారని రోజా ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ దాడులు కేవలం రాజకీయ నాయకులకే పరిమితం కాలేదని, పత్రికా కార్యాలయాలపైనా జరిగాయని రోజా ఆరోపించారు. సాక్షి, డెక్కన్ క్రానికల్ మీడియా సంస్థల ఆఫీసులపై జరిగిన దాడులను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని, చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని రోజా విమర్శించారు. ఈ దాడులన్నింటికీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.

# లోక్‌సభలో రాహుల్ vs కేంద్రం..

## ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- మొదటి పేజి తరువాయి

రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు.దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని అమిత్ షా మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ..వార్తాపత్రికల క్లిప్పింగులు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని రూల్ బుక్ నియమాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై, ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడాలని రాహుల్‌కు సూచించారు. మరోవైపు రాహుల్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీంతో సభాకార్యకలాపాలకు అంతరాయం కలగడంతో లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- మొదటి పేజి తరువాయి

. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మాకు ప్రాణహాని ఉంది..

- మొదటి పేజి తరువాయి

కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమారుడు జోగి రోహిత్ కుమార్ కూడా హైకోర్టులో మరో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు.తమ ఇంటిపై దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని రోహిత్ తన పిటిషన్‌లో ఆరోపించారు. గుంపులుగా వచ్చిన వ్యక్తులు దాడి చేస్తుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకుండా కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆధారాలుగా కోర్టుకు సమర్పిస్తున్నట్లు పిటిషన్‌లో తెలిపారు. ఈ రెండు పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం కాసేపట్లో విచారణ జరపనుంది.

# నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా నలుగురికి చైనాలో ఉరిశిక్ష అమలు చేశారు. ఈ మేరకు బాయి ఫ్యామిలీ మాఫియాకు చెందిన నలుగురికి ఉరిశిక్ష అమలు చేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది కోర్టు ఈ శిక్ష విధించింది. తాజాగా దానిని అమలు చేసింది. ఆన్‌లైన్ మోసాలతో పాటు వివిధ కేసులు ఎదుర్కొంటున్న ఈ గ్యాంగులపై చైనా కొంతకాలంగా తీవ్ర చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మయన్మార్‌కు చెందిన నేర ముఠాకు చెందిన సభ్యులకు మరణశిక్షను అమలు చేసినట్లు ఇటీవల స్థానిక మీడియా పేర్కొంది.

వేల కోట్ల రూపాయల కుంభకోణాలు, జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ మాఫియా, తమ వద్ద పనిచేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించిన 14 మంది చైనీయుల ప్రాణాలను తీసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో ముఠాలోని నలుగురికి శిక్షను అమలు చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ శిక్షను ఎప్పుడు అమలు చేశారనేది తెలియరాలేదు.

# దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులో 'మెడిటేషన్' అనే ఆల్బమ్‌కు గాను దలైలామాను ఈ అవార్డు వరించింది. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. దీనిని ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది.దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో అన్నారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని ఆయనపై ఆరోపణలు గుప్పించారు.

ఈ అవార్డును బీజింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తి అన్నారు.

తనకు గ్రామీ అవార్డు రావడంపై దలైలామా స్పందించారు. ఇది తన వ్యక్తిగత విజయంగా చూడటం లేదని అన్నారు. శాంతి, కరుణ, పర్యావరణంపై శ్రద్ధ, మానవత్వం అనేవి మానవాళి శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు. గ్రామీ గుర్తింపు ఈ సందేశాలను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

# చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారు: భూమన కరుణాకర్ రెడ్డి



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలో సీబీఐ నివేదిక వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ నేతలపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు ఇచ్చిన నివేదిక ప్రకారమే మాట్లాడానని చంద్రబాబు అంటున్నారని భూమన ఎద్దేవా చేశారు. టీటీడీకి ఈ బోర్డును పరిచయం చేసిందే జగన్ అని చెప్పారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసే అవకాశమే లేదని సీబీఐ తెలిపిందని అన్నారు. చంద్రబాబు హయాంలోనే బోలేబాబా డెయిరీ నుంచి టీటీడీ నెయ్యి కొనుగోలు చేసిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక బోలేబాబాను డిస్ క్వాలిఫై చేశామని అన్నారు.

తాను చేసిన వ్యాఖ్యలకు అంబటి రాంబాబు క్షమాపణ చెప్పినప్పటికీ దాడులు చేశారని భూమన మండిపడ్డారు. అంబటి ఇంటి మీదకు 3 వేల మంది రౌడీలను పంపించారని అన్నారు. జోగి రమేశ్ ఇంటిపై కూడా ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని విమర్శించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు జరిగాయని అన్నారు.

# కాపుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: నిమ్మల రామానాయుడు



కాపుల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి ఏమాత్రం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాపుల భవిష్యత్తు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మాజీ మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకుని వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని రామానాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దివంగత తల్లిదండ్రులను ఉద్దేశించి అంబటి వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, అంత దారుణంగా మాట్లాడుతున్నా జగన్ ఎందుకు వారించలేదని ప్రశ్నించారు. ఇది జగన్ దర్శకత్వంలోనే జరుగుతున్న డ్రామా అని స్పష్టమవుతోందన్నారు.

**చరిత్రను గుర్తుంచుకోవాలి**

చరిత్రను గుర్తుచేస్తూ.. బ్రిటిష్ కాలం నుంచి ఉన్న కాపు రిజర్వేషన్లను కాంగ్రెస్ ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి రద్దు చేస్తే, దామోదరం సంజీవయ్య, చంద్రబాబు మాత్రమే వాటిని పునరుద్ధరించారని రామానాయుడు తెలిపారు. చంద్రబాబు ఎంతో కష్టపడి కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే, అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ వాటిని రద్దు చేసి కాపులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. కాపుల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగాను 'రౌడీ' అని, 'చంపితే తప్పేంటి' అని అన్న గౌతమ్ రెడ్డికి ఆరు నెలల్లోనే ఫైబర్ నెట్ ఛైర్మన్ పదవి ఇచ్చి జగన్ సత్కరించారని మండిపడ్డారు. రంగా హత్యలో నిందితులుగా ఉన్నవారు వైసీపీ ప్రెస్‌మీట్లలో పక్కన కూర్చుని నీతులు చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాపుల కోసం పోరాడుతానన్న ముద్రగడ పద్మనాభం తన పేరు చివర 'రెడ్డి' అని తగిలించుకున్న తర్వాత కాపుల గురించి మాట్లాడటం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామన్నారు.

**బూతుల వల్లే వైసీపీ ఓటమి**

అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని వంటి నేతల బూతుల పురాణం కారణంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని, అధికారం కోల్పోయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. లోకేశ్ పై జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలను మహిళాలోకం అసహ్యించుకుంటోందన్నారు. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటే దానికి కులాన్ని ఆపాదించడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పల్నాడు వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమ (కాపు), బుద్ధా వెంకన్న (బీసీ)పై రాడ్లతో దాడి చేయించినప్పుడు జగన్‌కు వారి కులాలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

**చట్టం తనపని తాను చేసుకుపోతుంది**

గతంలో టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేసినప్పుడు అధికారంలో ఉన్న బొత్స సత్యనారాయణకు చట్టం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ శాంతిభద్రతలకే పెద్దపీట వేస్తారని, తప్పు ఎవరు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రామానాయుడు గుర్తుచేశారు. రంగాను అవమానించిన వారికి అండగా నిలుస్తున్న వైసీపీకి ఆయన పేరును ఉచ్ఛరించే హక్కు కూడా లేదని, అభివృద్ధిని పక్కనపెట్టి కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ నైజమని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## జనసేన పార్టీ సంస్థగత వ్యవహారాల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ని కలిసిన అడపా శ్రీనివాస్..



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 2:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనసేన పార్టీ సంస్థగత వ్యవహారాల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం విజయవాడలో జనసేన పార్టీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ మీటింగ్ అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో తాళ్లూరు రామ్ ని రాజానగరం జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం






**చింతూరు,పెన్ పవర్ ఫిబ్రవరి 2:**కారం గూడెం గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను తెలుగుదేశం పార్టీ చింతూరు మండల అధ్యక్షులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. క్రికెట్ గ్రౌండ్‌లో రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ ఆదివాసీ యువత అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తోందని, ముఖ్యంగా మన్యం ప్రాంతంలో యువత క్రీడలపై ఎక్కువ ఆసక్తి చూపుతోందని అన్నారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని, ఆరోగ్యమే గొప్ప సంపదని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌కు తన ట్రస్ట్ ద్వారా రూ.50 వేల మొదటి బహుమతిని ప్రకటించారు. అదేవిధంగా అల్లిగూడెం గ్రామంలో వాలీబాల్ కిట్, పేగ గ్రామంలో క్రికెట్ కిట్, నర్సింగపేటలో వాలీబాల్ కిట్‌లను క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి చిట్టిబాబు, గ్రామ పెద్దలు కారం రత్తయ్య, కారం శంకరమ్మ, కారం దేసయ్య, కారం సుబ్బారావు, మడకం దేసయ్య, మార్కెట్ కమిటీ సభ్యుడు పసుపులేటి సాల్మన్ రాజు, సోడే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు సరియాం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీవరసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా సామూహిక మాఘ పౌర్ణమి హారతి



**రంపచోడవరం, పెన్ పవర్ , ఫిబ్రవరి 2 :**పవిత్ర మాఘ పౌర్ణమి సందర్భంగా పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం పట్టణంలోని స్థానిక సంత మార్కెట్ వద్ద కొలువై ఉన్న శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సామూహిక మాఘ పౌర్ణమి హారతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శ్రీ లింగాల సీతారామాంజనేయ ప్రసన్న కుమార్ శర్మ సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ రాధాకృష్ణ సత్సంగ సభ్యులు లలితా సహస్రనామ పారాయణం నిర్వహించి, అనంతరం అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో సామూహిక హారతి కార్యక్రమాన్ని భక్తిపూర్వకంగా జరిపారు. మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో మార్మోగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంటే సత్యనారాయణ చిత్రపటానికి నివాళి..

**తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి..**



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి2:**కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో మాజీ టీడీపీ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు కంటే సత్యనారాయణ పెద్ద రోజు కార్యక్రమం లో రూడా చైర్మన్ తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,మరియు రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, ఏపీ ఆర్ చౌదరి, అడపా సుధీర్ కుమార్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంటే కేశ్వర రావు, మార్ని రాము, మార్ని బుజ్జి, రాజేష్, తెలగంశెట్టి శ్రీను,రొంగల శ్రీను నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన బిజెపి నాయకులు భారీగా పాల్గొన్నారు.

# తొర్రేడు పరిసర ప్రాంతాల్లో పులి సంచారం






- రూరల్ గ్రామాల్లో విద్యాసంస్థలకు సెలవు
- ప్రాణ భయంతో వణికిపోతున్న
- గ్రామాల ప్రజలు
- ఫారెస్ట్ ,పోలీస్ అధికారులతో ప్రజాప్రతినిధులు పరిశీలన
- ప్రస్తుతం తొర్రేడు నుండి కూనవరం పయనం ?

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

పచ్చని పొలాలు, వ్యవసాయ పనులతో ప్రశాంత వాతావరణం నెలకొన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిసర గ్రామాల్లో గత రెండు రోజులుగా పెద్దపులి సంచారం చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేక ప్రాణ భయంతో వణుకు పోతున్నారు. ప్రస్తుతం పెద్దపులి గ్రామ శివారు మొక్కజొన్న తోటలో ఉన్నట్లు దాని పాదముద్రల ద్వారా ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు. ఆదివారం పులి రెండు ఆవులు, ఒక దూడపై దాడి చేసి వాటిని చంపి వేసింది, పక్కనే ఉన్న అరటి తోటలో దూడను తిన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. సోమవారం సాయంత్రం వరకు కూడా మొక్కజొన్న తోటలోనే పులి ఉన్నట్లు ఫారెస్ట్ అధికారులు చెప్తున్నారు. ఆదివారం మూడు పశువులపై దాడి చేసిన నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ లు ఫారెస్ట్ ,పోలీస్ అధికారులతో సమీక్షిస్తూ ప్రాణ నష్టం లేకుండా పులిని బంధించే విధానంపై చర్చించారు. పరిసర గ్రామాల్లో సోమవారం విద్యా సంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు.

ఆదివారం ఆదివారం సోమవారం రెండు రోజులపాటు తోరేడు గ్రామ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు గడుపు తున్న మన్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పులిని ట్రాక్ చేసేందుకు ట్రాప్ కెమెరాలు , డ్రోన్ కెమెరాలను అధికారులు వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం పులి సీతానగరం మండలం మిర్తిపాడు కాల్వ మీదుగా కూనవరం గ్రామం పొలాల వైపు వెళ్లినట్లుగా ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందిందని, అయితే నిర్ధారణ కోసం ఫారెస్ట్ అధికారులు పులి పాదముద్రలు ఆధారాలను పరిశీలిస్తున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సాంకేతిక పరిజ్ఞానంతో యువతకు ఉపాధి అవకాశాలు



రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /మారేడిమిల్లి, పెన్ పవర్ , ఫిబ్రవరి 2:**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. మారేడుమిల్లి యువత శిక్షణ కేంద్రంలో సోమవారం డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ)--రంపచోడవరం మరియు 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం తెదేపా మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేషకుమార్ సౌజన్యంతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యువత మెరుగైన జీవన ప్రమాణాలు సాధించాలంటే సాంకేతిక పరిజ్ఞానం అత్యంత అవసరమని పేర్కొన్నారు. కంప్యూటర్, అంతర్జాల పరిజ్ఞానంతో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అందుకే ప్రభుత్వం ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ శిక్షణ 15 రోజుల పాటు కొనసాగుతుందని, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధృవీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం 50 మంది గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ అందిస్తున్నామని, వారికి ఉచిత భోజనం, రాత్రి బస వసతులు కల్పిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. గిరిజన యువతకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేషకుమార్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు మల్లా దుర్గాప్రసాద్, మండల ఉపాధ్యక్షులు దూడ సువర్ణకర్ణ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు పాము రాంబాబు, సర్పంచ్ సార్ల రమాదేవి, గుజ్జుమామిడి వలస ఎంపీటీసీ కొరగాని సువర్ణ రాజు, మాజీ సర్పంచ్‌లు మంగిరెడ్డి, సోమిరెడ్డి, యూత్ అధ్యక్షులు మల్లా బలరామ్, యూనిట్ ఇంచార్జి అందాల సూర్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి రేవుల జానకీరెడ్డి, జనసేన యూత్ అధ్యక్షుడు భీశెట్టి సత్య, మాజీ మండల అధ్యక్షుడు భీశెట్టి అప్పాజీ, గిరిజన సంక్షేమ డీడీ రుక్మాండయ్య, ఎంపిడిఓ కిషోర్, వైటీసీ మేనేజర్ సుదీష్, ప్రసన్న, వెలుగు కార్యాలయ ప్రతినిధి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

**అదనపు కమిషనర్ రామలింగేశ్వర్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 2 :** ప్రజలు అందజేసే ప్రతీ అర్జీని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగా మొత్తం 24 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 6, రెవెన్యూకి 3, టౌన్ ప్లానింగ్ కి 7, పబ్లిక్ హెల్త్ కి 2, వార్డు సచివాలయాలకు ఆరు ఉన్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి జాప్యానికి తావులేకుండా పరిష్కరించాలని అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు. అర్జీలను సత్వరం గా , నాణ్యతతో పరిష్కరించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలన్నారు. 24 గంటలలో గడువు ముగిసే పిటిషన్లు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం వార్డు సచివాలయాల సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి.. పెండింగ్ అర్జీలపై సచివాలయాల వారీగా ఆరా తీశారు. నగరంలో పోస్టర్ల నిషేధం అమలులో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ లో 39 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం" సోమవారం కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు.
జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చినారు. పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం" కార్యక్రమానికి 39 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు..

# అంబటి పై దాడి గర్హనీయం

**ఏపీ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2 :** కాపు నేత, మాజీ మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి రాంబాబు పై కొంతమంది కూటమి నాయకులు, గుండాలు దాడి చేయడం సిగ్గుచేటని ఏపీ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుమల రావు ఖండించారు. వారి ఇళ్ళు ఆఫీస్ పైన వాహనాలపై విధ్వంసం సృష్టించడం ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. రాజకీయాల్లో ఇటువంటి ధోరణి మంచి పద్ధతి కాదని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు ముద్దాల మండిపడ్డారు. అంబటిపై దాడి తీవ్రంగా ఖండించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్య తీసుకోవాలని కాపు నేతలకు రక్షణ కల్పించాలని కోరారు .గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం లోనే కాపు నేత స్వర్గీయ వంగవీటి మోహనరంగా ని పొట్టన పెట్టుకున్నారని గుర్తు చేసుకున్నారు. కాపు ఉద్యమ సమయంలో ముద్రగడ పద్మనాభం ని కూడా వారి కుటుంబ సభ్యులను సభ్య సమాజం తలదించుకునే విధంగా రోడ్డున పడే సారని, నేడు అంబటి రాంబాబు ని వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంబటి రాంబాబు కి వారి కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని ముద్దాల తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. వికలాంగుల సెల్ జాతీయ కన్వీనర్ కాపు జేఏసీ రాష్ట్ర నాయకులు ముత్యాల పోసి కుమార్ మాట్లాడుతూ, కాపులంతా ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాపు యువ నేత సీతారాం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మూడవ ఆర్థిక వ్యవస్థకు భారత్ లో దృడమైన మార్గం కేంద్ర బడ్జెట్

**మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ సోము, రాష్ట్ర నాయకులు ముళ్లపూడి డి రేణుక**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2 :** ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థకు భారత్ లో దృడమైన మార్గం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దోహదపడు తుందని, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.
ఏపీ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మీడియా సమావేశంలో సోము వీర్రాజు, రేణుకలు మాట్లాడారు. సోము మాట్లాడుతూ,
గడిచిన 12 సంవత్సరాలలో దేశ అభివృద్ధికి ఉపయోగపడే ప్రధాన మంత్రి మోదీ 350 సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఈ బడ్జెట్లో రోడ్డు, రైలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి రూ.12 లక్షల కోట్లు కేటాయించారన్నారు. రక్షణ శాఖ స్వయం సమృద్ధి సాధించే దిశగా15 శాతం బడ్జెట్ కేటాయించామన్నారు. విశాఖపట్నం లో డిజిటల్ హబ్ ఏర్పాటు, ఏపీ మైన్స్ పరిశ్రమకు లబ్ధి పొందనుందన్నారు.పోలవరానికి రూ.3200 కోట్ల బడ్జెట్ కేటాయిం చడం , అమరావతికి రూ .1500 కోట్లు బడ్జెట్ లో కేటాయించడం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను నెరవేరుతా యన్నారు. జాతీయ గ్రామీణ హామీ పథకానికి గతంలో కన్నా ఎక్కువ నిధులు రూ.90 వేల కోట్లు కేటాయించారన్నారు. ఏపీ లో టెక్స్టైల్ అభివృద్ధిలో బాగంగా 3 టెక్స్టైల్ పార్కులు,3 డెడికేటెడ్ పార్కు లు ఏర్పాటువుతు న్నాయన్నారు.ఖేల్ ఇండియా ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహానికి అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు.పూర్వదయలో రూ.13 వేలకోట్లతో ఉత్తర, మధ్య, రాయలసీమ లో బడ్జెట్ పెంచడం పర్యాటక అభివృద్ధి జరుగుతుం దన్నారు. హై స్పీడ్ రైల్ కారిడార్ లో భాగంగా ఏపీ లో అమరావతి, విశాఖపట్నం మీదగా రైళ్ల సర్వీసులు వస్తున్నాయన్నారు.రాష్ట్ర నాయకు రాలు ముళ్ళపూడి రేణుక మాట్లా డుతూ, గత బడ్జెట్ కి ఇప్పటికి చాలా తేడా ఉందని, ప్రతీ రంగాన్ని స్పృశించారన్నారు.విద్య, వైద్య, ఉద్యోగ కల్పన పై బడ్జెట్ ప్రధానంగా దృష్టి పెట్టడమైదన్నారు.
ఆత్మ నిర్బర్ ఇచ్చే బడ్జెట్ నీ, మెడికల్, టెక్నికల్ , క్లౌడ్, డేటా సెంటర్స్ లాంటి రంగాలు అభివృద్ధిలో పెద్ద పీట వేశారన్నారు.వ్యవసాయ , డిఫెన్స్ రంగం, మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత లభించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నోరు జారిన విషయం అంబటి రాంబాబు అంగీకరించారని, పథకం ప్రకారమే అరెస్ట్ చేయించుకున్నారని అభిప్రాయ పడ్డారు. వైయస్ఆర్ సిపి నాయకులు తమ తప్పు లేదని అంటున్నారని, కిలో నెయ్యి రూ. 420 రూపాయలకు దేశంలో ఎక్కడైనా దొరుకుతుందా అని జగన్ ను ప్రశ్నించారు.

## తయారు చేయని పొగాకు పన్ను లేదు రైతులకు ఊరట



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2**
కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈనెల 1 న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం తయారు చేయని పొగాకు పై పన్ను లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. సవరణ చేసిన పన్ను విధానం ప్రకారం బ్రాండ్ పేరు లేకుండా, రిటైల్ విక్రయానికి ప్యాక్ చేయని పొగాకుపై ఎక్సైజ్ డ్యూటీ పన్ను లేకుండా నిర్ణయించారు.
పొగాకు రైతాంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రైతుల బృందంతో కలిసి ఇటీవల రాజమండ్రి ఎంపీ పురందరేశ్వరి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి, లేఖ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లిన సంగతిని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ సవరణ రైతులకు ఉపశమనం కలిగించే దిశగా నిర్ణయమని తాను భావిస్తున్నానని.
ఎంపీ పురందరేశ్వరితెలిపారు.
రైతు అనుకూల దృక్పథంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి,ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ కి ఆమె కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సడలింపు వల్ల పొగాకు రైతులకు ఊరట లభించడంతో పాటు, వ్యవసాయ రంగానికి మరింత బలాన్ని అందిస్తుందన్నారు

## వై.సి.పి.మాజీమంత్రిను హెచ్చరించిన టిడిపినాయకులు



**–టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రానరేష్ కుమార్,**
**–టిడిపిపార్టీసీనియర్,నాయకులు బొర్రా నరసింహారావు**

**వి.ఆర్.పురం పెన్.పవర్.పిబ్రవరి.2**
ఆంధ్రప్రదేశ్,రాష్ట్రముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ జాతీయఅధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు,పైన అనుచిత వ్యాఖ్యలుచేయడం వై.సి.పి.పారీ మాజీమంత్రి అంబటిరాంబాబు మానుకోవాలని,సరైనబుద్ధి చెప్పుతా ము అంటూ తెలుగు దేశంపార్టీమండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,విమర్శించారు.ఈసందర్భగా టిడిపి పార్టీ సీనియర్,నాయకులు బొర్రానరసింహారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్,రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయు డు రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి చూసిఓర్వలేక,రానున్న ఎన్నికలోమళ్లీ తెలుగుపార్టీ అధికారంలోకి వస్తుదని,భ యంతో మతిస్థిమితంలేక,వై.సి.పి.మాజీమంత్రిఅంబటి రాంబాబు ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నారని,నోరు అదుపులో పెట్టుకొని,మాట్లాడాలని,రాష్ట్రం ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు,ఖబడ్దార్, అంటూ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టిడిపిపార్టీ సీనియర్,నాయకులు బొర్రా నరసింహారావు,మాజీ సొసైటీ డైరెక్టర్,ముత్యాల చంద్రశేఖర్,వాణిజ్య విబాగంఅధ్యక్షులు బీరకాసూర్య ప్రకాష్,రావు,రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవ లంరాజేంద్రప్రసాద్,బీసీ సెల్ నియోజక వర్గ అధ్యక్షులు ముత్యాల సిద్ధార్థ,(సిద్ధు)బీసీ సెల్ మండల అధ్యక్షులు కోట్ల శ్రీను,హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్,ముత్యాల శంకర్ రావు,రాజుపేట బూత్ ఇన్చార్జిలు ము త్యాలభాను, ముత్యాలఐపతిరావు,రేఖపల్లి యూ త్,లీడర్,ఈర్ల శీను, టిడిపిపార్టీ నాయకులు కార్యకర్తలుతదితరుల పాల్గొన్నా రు.

## బాధిత కుటుంబీకులను పరామర్శించిన జనసైనికులు.




**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 2.** నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి దొడ్డి గర్ల సువర్ణ రాజు సోమవారం నల్లజర్ల మండలంలో జన సైనికులతో కలిసి పర్యటించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చోడసాని బాపిరాజు ఆధ్వర్యంలో ముందుగా ముసుళ్ళగుంట వెళ్లారు. ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు దాగని శ్రీనివాస్ తో కలిసి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బి వెంకటేశ్వరరావు గృహానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. అనంతరం అది గ్రామానికి చెందిన నాయుడు శ్రీను కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీలు బియ్యం అందజేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మార్గాన్ని శివ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. వారి ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉందన్న విషయాన్ని గ్రహించిన జనసైనికులు వారు సేకరించిన 50 కేజీల బియ్యం కుటుంబీకులకు అందజేశారు. అలాగే ఆ ప్రాంతంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని విషయాన్ని స్థానికులు సుగుణ రాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కవులూరి సత్తిబాబు, వీర మహిళ సెంథిల్ కుమారి, కొత్తపల్లి హరిబాబు, వరుణ్, శివకృష్ణ, జనార్ధన్, శివ, వేణు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 2;** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అంది ఎలా తమ వంతు బాధ్యతగా కృషి చేస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం జీలుగుమిల్లిలో ప్రధాని ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు పొగరహిత వంట గదులు లభించి వారి ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబా ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని అన్నారు. మండలంలో 120 ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు కాగా 38 మందికి గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో



జనసేన, టిడిపి, బిజెపి మండల అధ్యక్షులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, గుడ్ల రాంబాబు, బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకురాలు బోరగం వెంకటలక్ష్మి, కూటమి నాయకులు బొమ్మిరెడ్డి సత్య వర ప్రసాద్ రెడ్డి, పులగం సుబ్బారెడ్డి, హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బిసివై రాజకీయ వ్యవహారాల కమిటీలో అత్తిలి రాజుకు కీలక బాధ్యత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 2 :** భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు అత్తిలి రాజుకు కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీ రాజకీయ వ్యూహాలను నిర్దేశించే ఈ కీలక కమిటీలో, ఆయనకున్న రాజకీయ అనుభవాన్ని, ప్రజా సమస్యలపై ఉన్న పట్టును గుర్తించిన బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఈ నియామకం చేపట్టారు. ఈ నియామకం పట్ల అత్తిలి రాజు హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో అత్యంత కీలకమైన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో తనకు స్థానం కల్పించిన అధినేత రామచంద్రయాదవ్ కు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇది తనపై ఉంచిన గొప్ప బాధ్యతగా స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా సమస్యలతో పాటు, రాష్ట్ర రాజకీయ అంశాలపై పార్టీ గళాన్ని బలంగా వినిపించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అధినేత ఆశయాలకు అనుగుణంగా, పార్టీ రాజకీయ బలోపేతానికి తన అనుభవాన్ని జోడిస్తానని ఆయన స్పష్టం చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 28 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 16,00,376 చెక్కులు పంపిణీ



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 02.** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఈరోజు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో "గ్రీవెన్స్ -- ప్రజా సమస్యల పరిష్కార వేదిక"ను నిర్వహించడం జరిగింది.

ఈ వేదిక ద్వారా తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన ప్రజలు, పార్టీ కార్యకర్తల వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలను స్వీకరించారు. ప్రతి సమస్యను గమనించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 28 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 16,00,376 విలువైన చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, టీడీపీ అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం.! అని అన్నారు

## ఏటి పల్లిలో బాల్య వివాహ ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం



**గంగవరం, పెన్ పవర్,ఫిబ్రవరి 2 :**
గంగవరం మండలం ఏటిపల్లి గ్రామంలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ కే. కుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిషేధ చట్టం--2006 నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండని బాలికలు, 21 సంవత్సరాలు నిండని బాలురు వివాహం చేసుకోవడం చట్టవిరుద్ధమని తెలిపారు. అలాగే అక్రమ సంబంధాలు పెట్టుకోవడం, ముఖ పరిచయం లేని వ్యక్తులతో వెళ్లడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలని పేర్కొన్నారు. ఈ విధమైన తప్పులు చేస్తే ఇరు కుటుంబాలపై లక్ష రూపాయలకు మించి జరిమానా విధించడంతో పాటు, రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని వివరించారు. అయితే ఈ చట్టం ప్రకారం మహిళలకు జైలు శిక్ష ఉండదని, పురుషులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. బాల్య వివాహానికి గురైన బాలికలను బాలికల సదనాల్లో (హాస్టళ్లలో) ఉంచుతారని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలిక, బాలుడు చదువు, ఆర్థిక సహాయం, శారీరక అభివృద్ధి, కుటుంబ సంబంధాలు తదితర అంశాలలో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్.ఎం. టి. పెంటయ్య, ఉపాధ్యాయులు ల. గంగాభవాని, కె. భవాని, అంగన్వాడీ టీచర్ బి. నిర్మల పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రభుత్వ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంతోష్ కుమార్.



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 02;** వెలుగు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం ఉంటుందని ఏ జడ్ కంపెనీ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ సంతోష్ కుమార్ అన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటును అందిస్తున్న పిఎంఎఫ్ఎంఈ, పిఎంఈజిపి పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని అయన తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయం లో సోమవారం ఏ జడ్ క్వాలిటీ డెవలప్మెంట్ కంపెనీ సిఈఓ కాళ్ళ జగపతి, జిల్లా ఇండస్ట్రియల్ జిఎం అరుణ ఆదేశాల మేరకు జీరో ఎఫెక్ట్ జీరో సర్టిఫికెట్ కోసం లబ్ధిదారులకు అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ కొబ్బరి ఆధారిత కోయిర్ పరిశ్రమ, పేపర్ ప్లేట్, జ్యూట్ బ్యాగ్స్ తయారు పరిశ్రమ, గార్మెంట్స్ ఇలా చిన్న తరహా పరిశ్రమలకు సబ్సిడీ రుణ సదుపాయం అందించడంలో సహకరిస్తాం అన్నారు. మండలంలో లబ్ధిదారులు అందరూ తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వి.ఎన్.సత్తిబాబు, సీసీలు మంగిన జయంతి, పడాల నాగవనజ, చిత్రాడ వెంకట ధనలక్ష్మి, అకౌంటెంట్ కుమార్, వివోఏ లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు రేషన్ షాపులు సీజ్

★ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు

**ఆలమూరు,పెన్ పవర్, ఫిబ్రవరి 02;** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండల కేంద్రమైన ఆలమూరులో సోమవారం సాయంకాలం జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ దాడుల్లో రెండు షాపులు సీజ్ జరిగింది. ఇంచార్జి ఎంఎస్ఓ పి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం విజిలెన్స్ శాఖకు చెందిన సీఐ ఐ.గోపాలకృష్ణ నేతృత్వంలో అధికారులు బృందం గ్రామంలో పర్యటించి 2, 29 రేషన్ షాపులను తనిఖీలు జరిపింది. 2వ నంబర్ షాపులో 27 కేజీల బియ్యం తక్కువగా ఉండటంతో పాటు అర కేజీ బరువు కలిగిన తొమ్మిది పంచదార ప్యాకెట్లు అధికంగా ఉన్నాయి. అలాగే 29 నెంబర్ షాపులో 24 కేజీల బియ్యం తక్కువగా ఉండటంతో పాటు అరకేజీ బరువు కలిగిన ఆరు ప్యాకెట్లు ఎక్కువగా. ఉన్నాయి. దీంతో విజిలెన్స్ అధికారులు ఆయా రేషన్ షాపులపై 6ఏ కేసును నమోదు చేశారు. అయితే చిల్లర సమస్య వల్ల పంచదార, తరుగు వల్ల బియ్యంలో వ్యత్యాసం ఉన్నట్లు డీలర్లు చెబుతున్నారు. విజిలెన్స్ అధికారులు గోపాలకృష్ణ, విజయకుమార్, గ్రామ రెవెన్యూ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సాగు భూముల్లో భూసార పరీక్షలు





మండల వ్యవసాయ అధికారి-విశ్వనాథ్.

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2:** నేషనల్ మిషన్ ఆన్ నేచరల్ ఫార్మింగ్-పథకం లో భాగంగా మండలం లో గల ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది మరియు అగ్రికల్చర్ అసిస్టెంట్ లకు సోమవారం గంగవరంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి-విశ్వనాథ్ మాట్లాడుతూ- మండలంలో 765 భూసార పరీక్షలు చెయ్యాలని,అందుకు రోజువారీగా నిర్దేశించిన లక్ష్యాలను అనుసరించి, అగ్రికల్చర్ ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉమ్మడిగా ఈ సాంపిల్స్ సేకరణ చేపట్టాలని అన్నారు. మట్టి నమూనాల సేకరణ విధానం, ల్యాబ్ నకు పంపించడం,పరీక్ష ఫలితాల విశ్లేషణ, తదను గుణంగా ఎరువులు వాడే విధానం గూర్చి వివరించారు. మట్టి నమూనాల సేకరణ విధానం రైతు పొలంలో సిబ్బంది కీ క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు.డి ఎల్ ఎం పి -శ్రీనివాస్ మాట్లాడుతూ - ఏ పి ఎన్ సి ఎఫ్ సిబ్బంది,అగ్రికల్చర్ అసిస్టెంట్ లతో కలిసి సేకరణ చేపట్టాలని,రోజూ వారి ఎన్ని సాంపిల్స్ తీసారో ఆన్లైన్ లో నమోదు, యాప్ వాడే విధానం వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో -అగ్రికల్చర్, ఏపీ సి ఎన్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బాలికల భద్రతే లక్ష్యం... చట్టాలపై అవగాహనే ఆయుధం



- వేములోవ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పోలీసుల అవగాహన సదస్సు
- గంగవరం ఎస్ఐ వెంకటేష్

**గంగవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 2:** గిరిజన ప్రాంతాల్లోని బాలికలను సామాజిక దురాచారాల నుంచి రక్షించడమే లక్ష్యంగా గంగవరం మండలం వేములోవ గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో విస్తృత స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగవరం పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో విద్యార్థినులకు ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న అనేక సవాళ్లపై, ముఖ్యంగా బాల్య వివాహాల నివారణ, మహిళలపై జరుగుతున్న నేరాలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అవి బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తును పూర్తిగా దెబ్బతీస్తాయని తెలిపారు. అలాంటి ఘటనలు తమ పరిసరాల్లో జరిగితే భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సఖీ యాప్, శక్తి యాప్ వినియోగంపై విద్యార్థినులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్‌ల ద్వారా వెంటనే సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే మాదక ద్రవ్యాల వినియోగం యువత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తుందని హెచ్చరిస్తూ, వాటి నివారణకు ప్రభుత్వం చేపట్టిన ఈగిల్ (1972) కార్యక్రమం గురించి వివరించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు నేరప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా విస్తరిస్తున్నాయని, అపరిచిత కాల్స్, లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లమ్మ, ఉపాధ్యాయులు సత్యవతి, డిప్యూటీ వార్డెన్ సుదర్శిని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సులమ్మ తల్లి జాతర సందర్భంగా శ్రీ బలుసులమ్మ అమ్మవారి, పసుపు కుంకుమ గాజులు మహిళలకు పంపిణీ





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 02.** తాడేపల్లిగూడెం స్థానిక భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారి దేవాలయం (పెద్ద శివాలయం) వద్ద మార్చి నెలలో జరుగునున్న బస్సులమ్మ తల్లి జాతర సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ బలుసులు అమ్మవారి, పసుపు కుంకుమ గాజులు మహిళలకు అందజేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న తాడేపల్లిగూడెం భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ ఢ మాజీ మున్సిపల్ చైర్మన్ ఈతకోట భీమశంకరరావు (తాతాజీ), ఈలీ బాబులు, జిల్లా మీడియా కో ఇంచార్జ్ నరిసే సోమేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీను, బలుసులమ్మ తల్లి దేవాలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీరంగం అంజి, ముత్యాలమ్మ తల్లి పాలకమండల సభ్యులు రామగాని సత్యనారాయణ, కత్తిముక్కల గణేష్,కంచర్ల రాజా, శ్రీశ్రీశ్రీ బలుసులు అమ్మవారి పసుపు కుంకుమ గాజులు అందజేశారు..

## మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందుచేత







**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 2:** పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం మండలం రంప గ్రామంలో 12వ శతాబ్దంలో చోళుల కాలంలో నిర్మితమైన ప్రాచీన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఏర్పాటైన రంప శివరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ప్రముఖులకు అందజేశారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళబొజ్జి రెడ్డి, శాసన సభ్యులు మిరియాల శిరీష దేవి, మాజీ శాసన సభ్యులు శీతంశెట్టి వేంకటేశ్వరరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఢ జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ రాజ్ , స్థానిక డీఎస్పీ సాయి ప్రశాంత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు లకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. మహాశివరాత్రి ఉత్సవాలను భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం హిందూ ధర్మ ప్రచార భక్త మండలి కో-ఆర్డినేటర్ శ్రీ నల్లమిల్లి వేంకటరామారెడ్డి ఉత్సవ కమిటీ సభ్యుల్ళుల్గొన్నారు

## ట్రైబల్ వెల్ఫేర్ కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసిన పోలవరం జిల్లా యూనియన్ నాయకులు



**గంగవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 2 :** పోలవరం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ కాంట్రాక్టు టీచర్స్ యూనియన్ అధ్యక్షులు శారపు కృష్ణమూర్తి దొర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని మంగళగిరిలోని కేంద్ర టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు, జీపీస్ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీలో ముఖ్యంగా రాబోయే డీఎస్సీ--2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పనిచేస్తున్న 1268 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయుల పోస్టులను మినహాయింపు చేయాలని,ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని, ట్రైబల్ వెల్ఫేర్ కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు యూనియన్ అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులతో పాటు జిల్లా యూనియన్ నాయకులు కిషోర్ కుమార్, కృష్ణారెడ్డి, గోపాలకృష్ణ, కాక లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి..



**కూనవరం,పెన్ పవర్,ఫిబ్రవరి 2.**కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక,రైతాంగ వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య అన్నారు.కూటూరు గ్రామపంచాయతీ నందు ఉపాధి హామీ కూలీలతో పంచాయితీ సెక్రటరీకి దరఖాస్తును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహించిన పెరుగుతున్న ధరలకుఅనుగుణంగా ఉపాధి అవకాశాలు లేక పేద ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఉపాధి హామీ చట్టాన్ని మార్చి,ఉపాధి హామీ పనికి రాకుండా ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.తక్షణమే 2006 మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలుచేయాలని, రెండు పూటల ఫేస్ మాస్ హాజరు రద్దు చెయ్యాలని,కనీస వేతనం 600 రూ ఇవ్వాలని,ఉపాధి హామీ పథకానికి కేంద్రమే నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరావు, కూటూరు సర్పంచ్ బి వెంకమ్మ, నూప రాజు,పైదా రాముడు,సోడే శ్రీరాములు,నారాయణ,దారయ్య, రమణ,భద్రమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మూరు పంచాయతీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నిక





**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2:**కుమ్మూరు పంచాయతీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సర్పంచ్ ముచ్చిక నాగార్జున ఆధ్వర్యంలో మామిళ్ళగూడెం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదు విభాగాలకు ఐదుగురు అధ్యక్షులతో పాటు మొత్తం 45 మంది సభ్యులతో పంచాయతీ కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ బలోపేతం లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎగుమంటి రామలింగారెడ్డి, చింతూరు జడ్పిటిసి సభ్యులు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు కోట్ల కృష్ణ హాజరయ్యారు. అలాగే ధర్మల విప్లవ కుమార్, యూత్ నాయకులు మడకం రమేష్, కురసం నాగేశ్వరరావు, కమల జయరాజు, కాక సీతారామయ్య, ముచ్చిక రాజయ్య, అన్నారావు, సరిన్, బాబు, వినోద్, రాంబాబు, లక్ష్మి, జయలక్ష్మి తదితర పంచాయతీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు దాడి చేసిన మూకలపై కేసులు పెట్టాలి



- అంబటి రాంబాబు అల్లుడురూపేష్ డిమాండ్
- చక్ర వడ్డీ తో సహా చెల్లిస్తాం : మాజీ ఎం ఎల్ ఏ జక్కంపూడి రాజా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో సిబిఐ సిట్ నివేదిక బయటపడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను ఉద్దేశించి మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడిన భాష, పదజాలం పై అంబటి రాంబాబు పోలీసుల వద్ద పశ్చాత్తాపం (అనకూడదని అయినా అనడం పొరపాటుగా) వ్యక్తం చేశారని ఆయన అల్లుడు రూపేష్

అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన , సమాజంలో వర్గాల మధ్య వైసమ్యాలు కలిగించిన పోలీసులు అరెస్టు చేసి, కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడం ఆదివారం తెల్లవారుజామున సెంట్రల్ జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. సోమవారం అంబటి రాంబాబు అల్లుడు రూపేష్, మాజీ ఎమ్మెల్యే రాజానగరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాన్యాయవాది హుస్సేన్ సాదిక్ లతో కలిసి జైల్లో రాంబాబుతో కలిశారు. అనంతరం జైలు బయట అనంతరం రూపేష్ మీడియాతో మాట్లాడుతూ, అంబటి రాంబాబు వ్యాఖ్యలు, వై సిపి వర్గాలకు, తెలుగుదేశం వర్గాలకు జరిగిన ఘర్షణలు , ఇంటి దహనం, ఆస్తులు ధ్వంసం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శనం అన్నారు.ఈ నేపథ్యంలో రాంబాబు అరెస్టు తర్వాత శాంతిభద్రతల సమస్యలకు ఎవరు ఏ పార్టీ వారైనా విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని, కేసులు పెడతామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారన్నారు. ముఖ్యమంత్రిని తిట్టినందుకు రాంబాబు పై కేసులు పెట్టినప్పుడు, రాంబాబు ఇంటిని దహనం చేసి, ఆస్తులు ధ్వంసం చేసిన, మహిళలను, పిల్లలను భయభ్రాంతులకు గురి చేసిన అల్లరి ముకలపై కేసులు ఎందుకు పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి పేమ్మసాని చంద్రశేఖరు అంబటి రాంబాబుకి సినిమా చూపిస్తామని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటన్నారు. చంద్రబాబు మాట ప్రకారంగా అల్లరి ముకలపై కేసులు పెట్టాలని, లేదంటే తాము న్యాయపరంగా పోరాడి ప్రైవేట్ గా కేసులు పెడతామని స్పష్టం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అంతా బాగానే ఉందన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ, తిరుమల లడ్డు కల్తీ సిట్ నివేదికపై వ్యాఖ్యానించిన సీనియర్, మాజీ మంత్రి , వయసు కూడా లెక్కచేయకుండా అంబటి రాంబాబును అరెస్టు చేయడం అక్రమన్నారు. ఆయన ఇంటిపై దాడి చేసి మహిళలను ఆందోళనకు గురి చేయడం రెడ్ బుక్కు రాజ్యాంగం ప్రకారం కక్ష సాధింపు జరుగుతుం దన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇంతకు ఇంత చక్ర వడ్డీతో సహా బదులు తీర్చుకుంటామన్నారు.

# గిరిజన చట్టాల ఉల్లంఘనపై హెచ్చరిక



చట్టి గ్రామంలో పెసా సమావేశం

**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2:**చట్టి గ్రామపంచాయతీలో పెసా అధ్యక్షులు తుర్రం చిన్న ముత్తయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెసా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ చట్టి గ్రామంలో రోడ్డు పక్కన వ్యాపారాలు, గృహ సముదాయాలు ఏర్పాటు చేసుకుంటున్న గిరిజనేతరుల దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసుల హక్కులను పరిరక్షించేందుకు రాజ్యాంగపరంగా ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని ఆయన తెలిపారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించి భూములను ఆక్రమించిన వారిపై ఎస్టీ శ్రీఅట్రాసిటీ కేసులు, ఎల్.టి.ఆర్ కేసులు తప్పనిసరిగా నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుర్రం రామయ్య, మోసం కన్నయ్య, రవ్వ ప్రసాద్, తుర్రం వెంకటరామయ్య, సోడి నాగరాజు తదితరులు పాల్గొని ఆదివాసుల హక్కుల పరిరక్షణకు తమ మద్దతు ప్రకటించారు.

# ప్రజల సంతృప్తి పెంపే లక్ష్యం గా రెవెన్యూ క్లినిక్‌లు






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2** :ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు -- ప్రజల సంతృప్తి పెంపే లక్ష్యం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్

ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఆన్నారు.సోమవారం కలెక్టరేట్ హాల్ లో జిల్లా డివిజన్ మండల స్థాయి అధికారులతో అర్జిల పరిష్కార విధానం పై దిశా నిర్దేశం చేసారు.ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ, రెవెన్యూ క్లినిక్‌ల ముఖ్య ఉద్దేశ్యం జవాబుదారితనం, పారదర్శకత కలిగి ఉండడమేనని అన్నారు. ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహించడం ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపి, వారి సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కారం అయ్యే రెవెన్యూ సమస్యలను అదే స్థాయిలో తక్షణమే పరిష్కరించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతతో, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ పేర్కొన్నారు. ప్రజలకు సేవలు అందించే విధానం, ప్రజలతో వ్యవహరించే తీరు, డబ్బులు వసూలు చేయడం, అర్జీలు స్వీకరించిన సందర్భంలో రసీదు ఇవ్వడం, క్షేత్ర స్థాయిలో పరిశీలన, ధృవీకరణ పత్రాల జారీ వంటి అనుబంధ అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

గణనీయమైన మెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, మరింత అభివృద్ధి సాధించాల్సి ఉందని స్పష్టం చేశారు. ఎండార్స్‌మెంట్ ఇచ్చే సమయంలో సరైన, హేతుబద్ధమైన జవాబు ఇవ్వడం ముఖ్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రొబేషన్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి కృష్ణ చైతన్య, డి ఆర్వో టి సీతారామ మూర్తి, ఆర్డీవో రాణి సుస్మిత, ఎస్డీసీ కె భాస్కర్ రెడ్డి, పి భాగ్యవతి, సీపీవో ఎల్ అప్పల కొండ, డీఎస్పీ బి . విద్య, డి డి వో పి వీణా దేవి , ఇతర జిల్లా అధికారులు, నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ నేతలపై రంపచోడవరం పోలీసులకు ఫిర్యాదు



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఫిబ్రవరి2:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అసభ్య పదజాలంతో దూషించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పై, అలాగే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని అసభ్య పదజాలంతో దూషించిన జోగి రమేష్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వర రావు, రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ప్రజాప్రతినిధులపై అసభ్య వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడమేనని, ఇటువంటి వ్యాఖ్యలను సహించరాదని ఆయన పేర్కొన్నారు. సంబంధిత నేతలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి తగవని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు అడబాల బాపిరాజు, పాకలపాటి సూర్యనారాయణ రాజు, కొంద్రు పాని, జనసేన శ్రీను, వీరబాబు, గల్లా సత్తిబాబు, పండేల అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గంగవరం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2:**గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రంలో ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గంగవరం పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ సూచించారు .ఈనెల 6వ తేదీ వరకు, తిరిగి ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఈ ఆధార్ క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆధార్లో సమస్యలు ఉన్న ,మార్పులు చేర్పులకు, కొత్త ఆధార్ నమోదుకు ఈ క్యాంప్ సెంటర్ నందు హాజరై చేయించుకోవాలని ఆయన కోరారు. అనధికార సెంటర్లో అధిక మొత్తంలో సొమ్ములు చెల్లిస్తూ నష్టపోవద్దని ప్రభుత్వ నిర్దేశించిన నామమాత్రపు ఫీజులు చెల్లించి ఆధార్ పొందడం ప్రతి భారత్ పౌరుడి హక్కని ఆయన అన్నారు.

# జన సైనికుడి కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 02.**ఇటీవల గుండెపోటుతో మరణించిన జనసైనికుడు కత్తెర రమేష్ కుటుంబానికి శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సొంత నిధులు లక్ష రూపాయల ఆర్థిక సహకారం అందజేశారు. తాడేపల్లిగూడెం మండలం, పెదతాడేపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం మాట్లాడుతూ జనసేన కార్యకర్త కుటుంబానికి పెద్ద మనసుతో సహకారం అందజేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి అన్ని విధాల సహకారం అందిస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్ గొప్ప ఔదార్యం ఉన్న వ్యక్తి అని అన్నారు. రమేష్ కుటుంబానికి అవసరమైన సహకారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కడప ప్రసాద్, పెట్టాడు పెల్లి సర్పంచ్ పోతుల అన్నవరం, పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ వేంకట కృష్ణ, ఎంపీటీసీ గోవిందు, టిడిపి నాయకులు వాడపల్లి సుబ్బరాజు, పసల కొండ, మద్దిపాటి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక నిక్షిప్త కేంద్రం జగ్గవరం లో ప్రారంభం.




**కూనవరం,పెన్ పవర్,ఫిబ్రవరి 2.**తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జగ్గవరం గ్రామానికి నూతనంగా మంజూరు చేసిన పుస్తక నిక్షిప్త కేంద్రం(బుక్ డిపో సెంటర్)ను ఆ గ్రామ సర్పంచ్ కారం పార్వతి,మాజీ జడ్పిటిసి ఎడవల్లి కన్యకా పరమేశ్వరి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో గ్రంథాలయాలు ఏర్పాటుచేయడం శుభ పరిణామమని అన్నారు.స్మార్ట్ ఫోన్ యుగంలో కూడా పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయడం భవిష్యత్ తరానికి అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో కూనవరం శాకా గ్రంథాలయం లైబ్రేరియన్ గోవిందరాజులు, నాగరాజు,రిటైర్డ్ ఉపాధ్యాయులు నోముల వెంకటస్వామి,మహిళా పోలీస్ మార్త,వెల్ఫేర్ అసిస్టెంట్ నాగమణి,సర్వేయర్ తిరుమల, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు కామేశ్వరరావు,కేర్ టేకర్ వాసం లక్ష్మి,గ్రామస్తులు కుంజా శోభారాణి,గుజ్జా కల్పన తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## కొరుకొండ బస్‌స్టాండ్ సెంటర్ రోడ్డుపై అక్రమ ఆక్రమణల తొలగింపు..



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 2:**తూర్పు గోదావరి జిల్లా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డిఎస్పీ (నార్త్ జోన్) పర్యవేక్షణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొరుకొండ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ సిబ్బంది సహకారంతో కొరుకొండ బస్‌స్టాండ్ సెంటర్ వద్ద గల జాతీయ రహదారి ( ఎన్ హెచ్)పై అక్రమ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో రహదారిపై మరియు ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు,దుకాణాలు, కూరగాయల స్టాళ్లు తదితర ఆక్రమణలను జేసీబీ సహాయంతో తొలగించడమైనది. ఈ ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నట్లు గుర్తించడమైనది.

నివారణ చర్యలు ప్రజలకు సూచనలు:

జాతీయ రహదారి, ఫుట్‌పాత్‌లు మరియు ప్రభుత్వ స్థలాల్లో ఎటువంటి ఆక్రమణలు చేయరాదు.

వ్యాపారులు తమ దుకాణాలను కేటాయించిన పరిమితులలోనే నిర్వహించాలి.

బస్‌స్టాండ్, రద్దీ ప్రాంతాలు మరియు రహదారులపై తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయరాదు.

ప్రజలు రహదారులపై వాహనాలను నిలిపివేయకుండా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

చట్టపరమైన చర్యలు:

భవిష్యత్తులో అక్రమ ఆక్రమణలు చేసిన యెడల మోటార్ వాహన చట్టం, భారతీయ న్యాయ సంహిత ( బి ఎన్ ఎస్ ) / ప్రజా రహదారులకు అడ్డంకి కలిగించే నిబంధనలు, పంచాయతీ చట్టం మరియు ఇతర వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించబడతాయి. పునరావృతమైతే మరింత కఠిన చర్యలు తీసుకోబడతాయి.

ఈ అక్రమ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించబడినది. ప్రజల భద్రత, సాఫీగా ట్రాఫిక్ నిర్వహణ మరియు రహదారి సౌకర్యాల దృష్ట్యా పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరడమైనది.

### వేటూరి సుందర రామమూర్తి 90వ జయంతి వేడుకలు.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 02.**వేల పాటల వేటూరి సుందర రామమూర్తి 90వ జయంతి వేడుకలు తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం రామచంద్రరావు పేట షిరిడి సాయి హైస్కూల్లో సమాఖ్య అధ్యక్షులు జంగా శ్రీనివాస రామ్ రాయ్ అధ్యక్షతన జరిగింది.

ముఖ్యఅతిథిగా ఈతకోట తాతాజీ , గట్టిం మాణిక్యాలరావు , మానవత అధ్యక్షులు రాజేంద్ర కుమార్, మండా బ్రహ్మాజీ , మాడబూసి జ్యోతి కుమారి, పిటి వెంకన్న పసుపులేటి రామచంద్రరావు గరికపాటి బాపయ్య శర్మ , ప్రవా శ్రీనివాసరావు , కుమారస్వామి , పి టి వెంకన్న తదితరులు పాల్గొన్నారుద

## అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి.

కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవం





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 02.**శ్రీ కనక మహాలక్ష్మి అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని, ప్రతి కుటుంబం ప్రగతి సాధించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు.స్థానిక సత్యవతి నగర్ లో శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. వచ్చే నెలలో బలుసులమ్మ జాతర వైభవం గా జరుగుతుందని ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారి కుంభాభిషేక కార్యక్రమంలో కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి , తెలుగు యువత అధ్యక్షులు గంధం సతీష్ , టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి , తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు , జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ళ గోపికృష్ణ, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ ఆటోలపై ఆర్‌టీఏ అధికారుల కొరడా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2 :**తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ పిల్లలను తరలిస్తున్న వాహనాలపై జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సోమవారం రవాణా శాఖ అధికారులు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి స్కూల్ పిల్లలను తరలిస్తున్న మొత్తం 11 ఆటోలపై కేసులు నమోదు చేయగా, అందులో 7 ఆటోలను సీజ్ చేసినట్లు జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ తెలిపారు.ఆటోలలో పరిమితికి మించి పిల్లలను ఎక్కించడం రోడ్డు భద్రతా నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించటమేనన్నారు. ఇటువంటి నిర్లక్ష్యపు రవాణా విధానాల వల్లే అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతూ, అమూల్యమైన ప్రాణ నష్టం సంభవిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి జిల్లావ్యాప్తంగా తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. కొంతమంది ఆటో డ్రైవర్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించు కుంటూ ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.పిల్లలను స్కూల్‌కు పంపే తల్లిదండ్రులు కూడా వారి భద్రత లో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. పాఠశాల యాజమాన్యానికి కూడా బాధ్యత ఉందని పేర్కొన్నారు.పరిమితికి మించి ఆటోలలో పిల్లలను స్కూల్‌కు పంపడం వల్ల జరిగే ప్రాణ నష్టం పూడ్చలేనిది. చిన్న నిర్లక్ష్యం కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగులుస్తుందనీ డి టి వో ఆర్ సురేష్ పేర్కొన్నారు ఈ తనిఖీల్లో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారులు పాల్గొనడం జరిగింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
93948 55244
షరతులు వర్తిస్తాయి

## తొర్రేడు పరిసర ప్రాంతాల్లో పులి సంచారం



- రూరల్ గ్రామాల్లో విద్యాసంస్థలకు సెలవు
- ప్రాణ భయంతో వణికిపోతున్న
- గ్రామాల ప్రజలు
- ఫారెస్ట్ ,పోలీస్ అధికారులతో ప్రజాప్రతినిధులు పరిశీలన
- ప్రస్తుతం తొర్రేడు నుండి కూనవరం పయనం ?

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

పచ్చని పొలాలు, వ్యవసాయ పనులతో ప్రశాంత వాతావరణం నెలకొన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిసర గ్రామాల్లో గత రెండు రోజులుగా పెద్దపులి సంచారం చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేక ప్రాణ భయంతో వణుకు పోతున్నారు. ప్రస్తుతం పెద్దపులి గ్రామ శివారు మొక్కజొన్న తోటలో ఉన్నట్లు దాని పాదముద్రల ద్వారా ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు. ఆదివారం పులి రెండు ఆవులు, ఒక దూడపై దాడి చేసి వాటిని చంపి వేసింది, పక్కనే ఉన్న అరటి తోటలో దూడను తిన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. సోమవారం సాయంత్రం వరకు కూడా మొక్కజొన్న తోటలోనే పులి ఉన్నట్లు ఫారెస్ట్ అధికారులు చెప్తున్నారు. ఆదివారం మూడు పశువులపై దాడి చేసిన నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ లు ఫారెస్ట్ ,పోలీస్ అధికారులతో సమీక్షిస్తూ ప్రాణ నష్టం లేకుండా పులిని బంధించే విధానంపై చర్చించారు. పరిసర గ్రామాల్లో సోమవారం విద్యా సంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు.

ఆదివారం ఆదివారం సోమవారం రెండు రోజులపాటు తోరేడు గ్రామ ప్రజలకు కంటిమీద కొనుక్కు లేకుండా ప్రాణాలు ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పులిని ట్రాక్ చేసేందుకు ట్రాప్ కెమెరాలు , డ్రోన్ కెమెరాలను అధికారులు వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం పులి సీతానగరం మండలం మిర్తిపాడు కాల్వ మీదుగా కూనవరం గ్రామం పొలాల వైపు వెళ్లినట్లుగా ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందిందని, అయితే నిర్ధారణ కోసం ఫారెస్ట్ అధికారులు పులి పాదముద్రలు ఆధారాలను పరిశీలిస్తున్నారు.

## ఉపాధి హామీ కార్మికుల నిరసన



### వీబీజీఆర్‌ఎంజీ రద్దు చేయాలి

**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2:**కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వీబీజీఆర్‌ఎంజీ పథకాన్ని వెంటనే రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ చింతూరు మండలంలో ఉపాధి హామీ కార్మికులు సిపిఎం చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

సోమవారం సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చింతూరు, కల్లేరు, చదలవాడ, ఏడుగురాళ్లపల్లి, చిడుమూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఈ ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు సీసం సురేష్, మండల నాయకులు పోడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మలు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేదలకు జీవనాధారం కల్పించిందని, నిధులు తగ్గిస్తే గ్రామీణ ప్రాంతాల్లో పేదలు మళ్లీ వలస బాట పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్ర బడ్జెట్ గ్రామీణాభివృద్ధిపై వివక్ష చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించి, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్లేరు జంక్షన్ వద్ద లభ్యమైన శిశువు తల్లి గుర్తింపు





### కౌన్సిలింగ్ నిర్వహణ

**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2:**కల్లేరు జంక్షన్ సమీపంలోని డాబా వెనుక పొదల్లో లభ్యమైన నవజాత మగ శిశువు తల్లి ఆచూకీ అధికారులకు తెలిసింది. ఒడిశా రాష్ట్రం మల్కానగిరి జిల్లా దయాల్ టంగ్ హిల్టాప్ గ్రామానికి చెందిన తల్లిని, వారి బంధువులను గుర్తించి చింతూరుకు తీసుకువచ్చారు. శిశువుతో పాటు సిడిపిఓ, అంగన్వాడి వర్కర్లు, వైద్యుల సమక్షంలో తల్లికి కౌన్సిలింగ్ నిర్వహించారు. శిశువు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ద్వారా శిశు గృహానికి తరలించాలని నిర్ణయించారు. అంతవరకు శిశువుకు చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.

## గోపాలపురంలో ఈనెల 13న మెగా జాబ్ మేళా.



### చైర్మన్ రాంబాబు.

**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 2.**

స్థానిక శర్వాణి పాఠశాలలో ఈనెల 13వ తేదీన మానవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం పాఠశాల ఆవరణలో మానవత సంస్థ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రాపాక ఫణి కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాంబాబు మాట్లాడారు. ఈ మేళాలో 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 1200 మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. గోపాలపురం దేవరపల్లి తాళ్లపూడి కొయ్యలగూడెం నిడదవోలు కొవ్వూరు తదితర మండలం చెందిన నిరుద్యోగ యువత ఈ మేళాలో పాల్గొని వారు కోరారు. పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జోడాల వెంకట్, కోశాధికారి గెడా జోగేంద్ర ప్రసాద్, కోచ్ చైర్మన్ నెల్లి చంద్రశేఖర్, కృప వరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈగా ఐ. సూర్యకళ బాధ్యతలు స్వీకరణ



**కాకినాడ పెన్ పవర్, ఫిబ్రవరి 2:**విశాఖపట్నం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈగా పనిచేస్తూ పదోన్నతి పొందిన ఐ.సూర్యకళ సోమవారం కాకినాడ జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈగా నియమితులై కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# వరల్డ్ కప్ టాప్ స్కోరర్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రెండూ అతడికే: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ఈ మెగా టోర్నీని భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ చరిత్రలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ చోటు చేసుకుంది . టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్- నెదర్లాండ్ మధ్య జరగుతుంది. వరల్డ్ కప్ కు కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో క్రికెట్ ఫ్యాన్స్ ఈ మెగా టోర్నీ కోసం ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. సొంతగడ్డపై జరగనుండడంతో టీమిండియా ఈ టోర్నీలో టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. టోర్నీకి ముందు ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ 2026 టీ20 వరల్డ్ కప్ లో టాప్ స్కోరర్ ఎవరో తన అభిప్రాయాన్ని తెలిపాడు. వరల్డ్ కప్ టాప్ స్కోరర్ గురించి మాట్లాడుతూ పాంటింగ్ ఇలా అన్నాడు.. "అభిషేక్ శర్మ స్టార్ బ్యాటర్. ఎక్స్ పీరియన్స్ లేకపోవడం అతనికి సానుకూల విషయం అని నేను భావిస్తున్నాను. 2026 టీ 20 వరల్డ్ కప్ లో అభిషేక్ టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ కూడ కావొచ్చు. అతని హిట్టింగ్ అద్భుతంగా ఉంటుంది. అభిషేక్ ఆడితే ఇండియాకు వరల్డ్ కప్ గెలవడం పెద్ద కష్టం కాదు. ఒకవేళ అతను విఫలమైతే ఇండియా వరల్డ్ కప్ ఆశలు సంక్లిష్టం అవుతాయి. ఈ వరల్డ్ కప్ కు అభిషేక్ ఇండియాకు చాలా కీలకం. నేను అభిషేక్ శర్మ మొదటి కోచ్ ని. 17 ఏళ్ళ వయసులో ఢిల్లీ జట్టులో ఉన్నప్పుడే చాలా ప్రభావం చూపించాడు. అభిషేక్ పై నాకు భారీ అంచనాలు ఉన్నాయి". అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు.

**తొలిసారి 20 జట్లతో టీ20 వరల్డ్ కప్:**

ఈ సారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, స్కాట్లాండ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి. ఇండియా, పాకిస్తాన్ , అమెరికా (ఖూూ), నమీబియా, నెదర్లాండ్స్ ఒకే గ్రూపులో ఉన్నాయి. భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

**నెంబర్ వన్ ర్యాంక్ లో అభిషేక్ శర్మ:**

అభిషేక్ శర్మ ప్రస్తుతం టీ20 ఫార్మాట్ లో నెంబర్ వన్ బ్యాటర్ గా ఉన్నాడు.

వరల్డ్ క్రికెట్ లో నెంబర్ వన్ బ్యాటర్ గా కొనసాగుతున్న అభిషేక్ అంచనాలకు తగ్గట్టుగా ఆడుతున్నాడు. ప్రత్యర్థి, వేదిక, బౌలర్ తో సంబంధం లేకుండా తన బ్యాటింగ్ తో బౌలర్లకు చెమటలు పట్టిస్తున్నాడు. న్యూజిలాండ్ తో జరిగిన తొలి టీ20లో కేవలం 35 బంతుల్లోనే 84 పరుగులు చేసి కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఓవరాల్ గా ఈ సిరీస్ లో 45 యావరేజ్.. 250 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేశాడు.

# ఇలాగైతే కంగారులను కష్టమే: ఆస్ట్రేలియాకు వరుస షాకులు.. వరల్డ్ కప్ నుంచి ముగ్గురు మొనగాళ్లు ఔట్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ ముందు ఆస్ట్రేలియా జట్టుకు ఊహించని షాక్ లు తగులుతున్నాయి. కొన్నేళ్లుగా ఆ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్న ఫాస్ట్ బౌలర్స్ పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజల్ వుడ్ అందుబాటులో ఉండడం లేదు. కొన్ని నెలల క్రితం స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇటీవలే వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ టీ20 వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. తాజాగా జోష్ హేజల్ వుడ్ వరల్డ్ కప్ లోని గ్రూప్ మ్యాచ్ లకు దూరం కావడంతో కంగారులకు వరల్డ్ కప్ ముందు కోలుకోలేని దెబ్బ తగిలింది. హేజల్ వుడ్ మడమ గాయంతో బాధపడుతున్నాడు. ఈ స్టార్ పేసర్ ప్రస్తుతం సిడ్నీలో పునరావాసం పొందుతున్నాడు. వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా జట్టుతో పాటు జోష్ ఇండియాకు ట్రావెల్ చేయడం లేదు. హేజల్ వుడ్ స్థానంలో సీన్ అబాట్ ను ట్రావెలింగ్ రిజర్వ్ గా ఎంపిక చేశారు. గాయం కారణంగా యాషెస్ సిరీస్ కు దూరమైన ఈ ఆసీస్ పేసర్..పూర్తి ఫిట్ నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు. సూపర్ 8 మ్యాచ్ లకు కూడా హేజల్ వుడ్ అందుబాటులో ఉండడం అనుమానంగా మారింది. హేజల్ వుడ్ తో పాటు మరో ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్ కూడా ఫిట్ బేస్ సమస్యలతో బాధపడుతున్నాడు.

**వెన్ను గాయంతో కమ్మిన్స్ ఔట్:**

స్టార్ బౌలర్ పాట్ కమ్మిన్స్ టీ20 వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. వెన్ను గాయం కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి కమ్మిన్స్ వైదొలిగినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. అతడి స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్క్యూ ఈవెంట్‌కు కమ్మిన్స్ దూరం కావడం ఆస్ట్రేలియాకు భారీ ఎదురు దెబ్బనేనని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ టీమ్‌లో ప్రధానంగా రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ మెగా టోర్నీకి దూరం కాగా అతడి స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ను ఎంపిక చేసింది. ఇక, తాత్కాలిక జట్టులో ఉన్న మాట్ షార్ట్‌ను తప్పించి అతని స్థానంలో మాట్ రెన్షాను జట్టులోకి తీసుకుంది. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజల్ వుడ్ త్రయం లేకుండా ఆసీస్ పేస్ బౌలింగ్ కొంచెం బలహీనంగా మారింది. ఇటీవలే పాకిస్థాన్ తో జరిగిన మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను ఆస్ట్రేలియా 0-3 తేడాతో కోల్పోయింది. బ్యాటింగ్ దుర్భేధ్యంగా కనిపిస్తున్నా బౌలింగ్ లో మాత్రం కంగారూల జట్టుకు ఇబ్బందులు తప్పేలా లేదు. స్పిన్నర్ ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్ పై ఆసీస్ భారీ ఆశలు పెట్టుకుంది. జట్టులో ఎక్కువగా ఆల్ రౌండర్లు ఉండడం కలిసొచ్చే విషయం.

## USAతో ఇండియా 'ఏ' వార్మప్ మ్యాచ్.. అందరి దృష్టి అతడిపైనే.. లైవ్ స్ట్రీమింగ్ ఎందులో చూడాలంటే..?







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 వార్మప్ మ్యాచ్ లకు రంగం సిద్ధమైంది. సోమవారం (ఫిబ్రవరి 2) నుంచి వార్మప్ మ్యాచ్ లు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా నేడు ఇండియా ఏ (ఫిబ్రవరి 2) యూఎస్ఏతో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఇండియా సీనియర్ జట్టు ఆడడం లేదు. చిన్న జట్టు కావడంతో బీసీసీఐ భారత 'ఏ' జట్టును ప్రకటించింది. జియో హాట్‌స్టార్ యాప్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లోవార్మప్ మ్యాచ్ లు ప్రత్యక్ష ప్రసారమవుతాయి. మ్యాచ్ సాయంత్రం 5:00 గంటలకు ప్రారంభమవుతుంది. డీవై పాటిల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఖూూతో నేడు జరగబోయే మ్యాచ్ లో అందరి కళ్ళు టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మపైనే ఉన్నాయి. గత నెలలో విజయ్ హజారే ట్రోఫీ ఆడుతూ తిలక్ గాయపడ్డాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ తో జరిగిన ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ కు దూరమయ్యాడు. పూర్తి ఫిట్ నెస్ సాధించిన ఈ హైదరాబాదీ కుర్రాడు వార్మప్ మ్యాచ్ లో రాణించి గాడిలో పడాలని టీమిండియా యాజమాన్యం భావిస్తుంది. తిలక్ వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉండడంతో తనను తాను నిరూపించుకోవడం ఈ యంగ్ ప్లేయర్ కు చాలా కీలకం. తిలక్ తో పాటు రవి బిష్ణోయ్, రియాన్ పరాగ్ కూడా వరల్డ్ కప్ స్క్వాడ్ లో సుందర్ స్థానంలో ఎంపికయ్యే అవకావం ఉంది. దీంతో వీరిద్దరూ రాణించడం తప్పనిసరి. సోమవారం (ఫిబ్రవరి 2) నుంచి ఫిబ్రవరి 6 వరకు వార్మప్ మ్యాచ్ లు జరుగుతాయి. మొత్తం 5 రోజుల పాటు 15 మ్యాచ్ ల షెడ్యూల్ ను ఏర్పాటు చేశారు. మొత్తం మూడు వార్మప్ మ్యాచ్ లు టీమిండియా ఆడాల్సి ఉంది. ఇండియా ఫిబ్రవరి 4 న సౌతాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. ఇండియా వరల్డ్ కప్ లో ఆడబోయే లీగ్ మ్యాచ్ కు మూడు రోజుల ముందు డీవై పాటిల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు జరుగుతుంది. అమెరికా, నమీబియాలతో జరగబోయే వార్మప్ మ్యాచ్ ల కోసం సీనియర్ జట్టు కాకుండా ఇండియా 'ఏ' జట్టు ఆడనుంది. బీసీసీఐ భారత 'ఏ' జట్టును సోమవారం (ఫిబ్రవరి 2) ప్రకటించింది. భారత ఏ జట్టుకు బదోనీ కెప్టెన్సీ చేయనున్నాడు. స్క్వాడ్ లో తిలక్ వర్మను కూడా ఎంపిక చేశారు. మన్ ధీర్, అశుతోష్ శర్మ, ప్రియాంష్ ఆర్య, ఉర్విల్ పటేల్, పరాగ్ జట్టులో సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. ఇటీవల న్యూజిలాండ్ తో జరిగిన టీ20 సిరీస్ లో ఆడిన రవి బిష్ణోయ్ ని ఎంపిక చేశారు. మానవ్ సుతార్, విప్రజ్ నిగమ్ రూపంలో ఇద్దరు స్పిన్-బౌలింగ్ ఆల్ రౌండర్లు ఉన్నారు. గుర్జప్నీత్ సింగ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్, అశోక్ శర్మ లతో పేస్ విభాగాన్ని ఎంపిక చేశారు.

# ట్రెండీ అవుట్ ఫిట్ లో మృణాల్ అందాలు.. ఆ లుక్ చూసారా?



టాలీవుడ్‌లో 'సీతారామం'తో ప్రతి ఇంటి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్, ఇప్పుడు తన గ్లామర్ , స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. సంప్రదాయబద్ధమైన పాత్రల్లో ఎంతగా ఒదిగిపోతుందో, మోడ్రన్ బోల్డ్ లుక్స్‌లోనూ అంతే ధైర్యంగా తన బ్యూటీని ఎలివేట్ చేయగలగడం ఆమె ప్రత్యేకత. కేవలం నటనకే పరిమితం కాకుండా, ఫ్యాషన్ ఐకాన్‌గా మారుతూ యువతలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. భాషతో సంబంధం లేకుండా తన ప్రతిభతో నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న ఈ భామ, ఫ్యాన్స్ మనసుల్లో చెరగని ముద్ర వేస్తోంది.



**మోడ్రన్ లుక్‌లో వెలిగిపోతున్న మృణాల్:**

తాజాగా ఇన్స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ సరికొత్త స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తోంది. ఈ పిక్స్‌లో ఆమె ధరించిన మోడ్రన్ అవుట్‌ఫిట్ ఆమె పర్సనాలిటీకి పర్ఫెక్ట్‌గా సరిపోయింది. కెమెరా కళ్లకు తన చూపులతో మంత్రముగ్ధులను చేస్తూ, ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ ఫోజులు ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆమె హెయిర్ స్టైల్, ఇయర్ రింగ్స్, సింపుల్ మేకప్ మరియు ఆ యాటిట్యూడ్ ఈ ఫోటోలకు ఒక వింటేజ్ క్లాసిక్ టచ్ ఇచ్చాయి. ఆధునికతను, క్లాస్‌ను మిక్స్ చేస్తూ మృణాల్ చేసిన ఈ ఫోటో షూట్ చూస్తుంటే, ఆమె కేవలం నటి మాత్రమే కాదు, ఒక పర్ఫెక్ట్ మోడల్ అని కూడా నిరూపిస్తోంది.

**సినిమా ప్రయాణం:**

కెరీర్ హిట్స్ , క్రేజీ ప్రాజెక్ట్స్ తో మృణాల్ కెరీర్ ప్రస్తుతం గోల్డెన్ ఫేజ్‌లో ఉంది. తెలుగులో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి క్లాసిక్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న ఈమె, గత ఏడాది తెలుగులో సినిమా లేకపోయినా బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీతో అలరించింది. 2023 లో వచ్చిన హాయ్ నాన్న సినిమా సక్సెస్ తరువాత వరుసగా ఆమె నుండి మూవీస్ వస్తాయి అని అనుకున్నారు. అనుకున్నట్టు గానే విజయదేవరకొండ సరసన 2024లో ఫామిలీ స్టార్ వండి మూవీ లో నటించారు.కానీ సినిమా అంతగా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక తెలుగులో ఆమె సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఆమె రాబోయే చిత్రాల విషయానికి వస్తే, తెలుగులో అడవి శేషు తో డెకాయిట్ మూవీలో నటిస్తున్నారు. ఇక బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ప్రభాస్ 'ఫౌజి' (ఖీఓబుయిఱ) సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి, ఇది నిజమైతే టాలీవుడ్‌లో ఆమె క్రేజ్ ఆకాశాన్ని తాకడం ఖాయం. అలాగే హిందీలో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను చాలా ప్లాన్డ్‌గా ముందుకు తీసుకెళ్తోంది. అందానికి కేవలం రూపమే కాదు, ఆత్మవిశ్వాసం కూడా తోడైతే ఎలా ఉంటుందో మృణాల్ ఠాకూర్‌ను చూస్తే అర్థమవుతుంది. అటు వెండితెరపై నటనతో, ఇటు సోషల్ మీడియాలో తన స్టైల్‌తో మృణాల్ చేస్తున్న హంగామా ఇప్పుడప్పుడే తగ్గేలా లేదు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలతో ఆమె మనల్ని అలరించాలని కోరుకుందాం.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965